సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం : 11 : ఆగస్టు : 2025



రామప్ప కీర్తిని చాటేలా..
పర్యాటక జిల్లాగా పేరొందిన ములుగు జిల్లాలోని కూడళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- 8లో▸



కబ్జా చేశాడు..అద్దెకిచ్చాడు!
చింతగట్టు క్యాంపు సమీపంలో ఓ వ్యక్తి ఎస్సారెస్పీ భూమిని కబ్జా చేసి.. ఆపై ఇసుక లారీల పార్కింగ్‌కు అద్దెకిచ్చాడు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/24^0$

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల సాధారణ నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన



కాటారం : మండలంలో నేడు (సోమవారం) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. స్థానిక బీఎల్‌ఎం గార్డెన్స్‌లో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డుల మంజూరు పత్రాలు, సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, మేడిగడ్డ వద్ద ప్రమాదవశాత్తు మరణించిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కుల అందజేతలో మంత్రి పాల్గొననున్నారు. అనంతరం కాటారం గ్రామ పంచాయతీ సమీపంలో రూ.36 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్, మద్దులపల్లి, ధర్మసాగర్, అంకుషాపూర్, రేగులగూడెం నూతన గ్రామపంచాయతీ, అంగన్‌వాడీల నూతన భవన నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అయ్యప్ప ఆలయంలో నిర్వహించనున్న ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలోను ఆయన పాల్గొననున్నారు. అలాగే మహాముత్తారం మండలంలో రూ.2.30 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనాన్ని ప్రారంభించి పోలారం, కొర్లకుంట, మహబూబ్‌పల్లి, నిమ్మగూడెం, ములుగుపల్లి, మదారం, బోర్లగూడెం గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి కార్యక్రమాలకు సంబంధించి అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు.

కుమారస్వామికి నేషనల్ అవార్డు



భూపాలపల్లి రూరల్: బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు 2025 సంవత్సరానికి గాను కాళేశ్వరం దేవస్థానం సరస్వతి పుష్కర ఉత్సవ కమిటీ మెంబర్‌గా ఓదెల కుమారస్వామి సేవలందించడం పట్ల బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ జాతీయ అవార్డు నేషనల్ కమిటీ చైర్మన్, జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వానపత్రాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఓదెలుకు అందజేశారు అవార్డును వచ్చే నెల సెప్టెంబర్ 5న తిరుపతిలోని గంధమనేని శివయ్య మెమోరియల్ ట్రస్టు కమ్యూనిటీ హాల్‌లో అందజేయనున్నట్లు వెల్లడించారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



భూపాలపల్లి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రానికి ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ 42 శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో చట్టం చేయకుండా మతం రంగు పులుముతోందని విమర్శించారు. రిజర్వేషన్లు మత ప్రాతిపాదికన కాదని, వెనుకబడిన వర్గాలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక సమాన అవకాశాలు కల్పన కోసమన్నారు.

హేమాచలుడికి భక్తిశ్రద్ధలతో పూజలు



మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్లు, ప్రైవేటు బస్సులు, ఆటోలలో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అత్యంత భక్తిశద్ధలతో ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పవన్‌కుమార్, ఈశ్వర్‌చంద్ స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. తిలతైలాభిషేకం పూజలో పాల్గొన్న భక్తులు స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తుల పేరిట పూజారులు గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని భక్తులకు వివరించారు.

అధికారులు కావలెను..

భూపాలపల్లి మున్సిపాలిటీలో ఆఫీసర్లు, సిబ్బంది కొరత
- నగర పంచాయతీగా ఏర్పడినప్పటి పోస్టులే
- అందులోనూ సగానికి పైగా ఖాళీలు
- కొత్త పోస్టుల మంజూరు ఊసే లేదు
- కుంటుపడుతున్న అభివృద్ధి పనులు



భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయం



భూపాలపల్లి: పెద్ద భవనం.. విశాలమైన గదులు.. ఒక్కో విభాగానికి ప్రత్యేక గది.. ఫర్నీచర్.. విధులు నిర్వర్తించేందుకు మాత్రం అధికారులు, సిబ్బంది కొరత.. ఇదీ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిస్థితి. గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన సమయంలో మంజూరైన పోస్టులే నేటికీ కొనసాగుతున్నాయి. అందులోనూ సగానికి పైగా పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఫలితంగా అభివృద్ధి కుంటుపడటమే కాక పలు పనులు ఆలస్యం అవుతున్నాయి.

అన్ని విభాగాల్లో సగం ఖాళీలే..

గ్రామ పంచాయతీగా ఉన్న భూపాలపల్లి 2012 జనవరి 21న నగర పంచాయతీగా, 2017 ఆగస్టు 18న గ్రేడ్ 3 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. మున్సిపాలిటీకి 34 పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం సగం ఖాళీగానే ఉన్నాయి. మేనేజర్ రెండు నెలల క్రితం డిప్యూటేషన్‌పై బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లగా ఆ స్థానంలో ఎవరిని నియమించలేదు. ఒక సీనియర్ స్టెనోగ్రాఫర్ ఉండాల్సి ఉండగా లేరు. సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురికి బదులుగా ఇద్దరు, ఒక సిస్టం మేనేజర్, ఒక సిస్టం అసిస్టెంట్(డాటా ఎంట్రీ ఆపరేటర్) లేరు. దీంతో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సిస్టం అసిస్టెంట్‌ను నియమించుకున్నారు. వార్డు ఆఫీసర్ పోస్టులు రెండు ఉండగా ఇద్దరు ఉన్నారు. అకౌంట్ సెక్షన్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్ ఒకరు చొప్పున ఉండగా, సీనియర్ అకౌంటెంట్ పోస్టు ఒకటి ఉన్నప్పటికీ ఖాళీగా ఉంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్యూటేషన్‌పై వరంగల్ వెళ్లగా జూనియర్ అసిస్టెంటే ఆ విధులు నిర్వర్తిస్తున్నాడు. హెల్త్ అసిస్టెంట్ ఇద్దరికి గాను ఒకరు, శానిటరీ జవాన్‌లు ముగ్గురికి గాను ఇద్దరు ఉన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ ఒక పోస్టు ఉండగా ఇటీవలే భర్తీ చేశారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉండగా సీడీఎంఏ నుంచి ఔట్ సోర్సింగ్‌పై ఒకరు వచ్చి పని చేస్తున్నారు. అసిస్టెంట్ ఈఈ ఒకరు ఉండగా, ఒక డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్, క్యాడ్ ఆపరేటర్ లేరు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో టీపీవో, టీపీఎస్, టీపీబీవో, ట్రేసర్, క్యాడ్ ఆపరేటర్, టౌన్ సర్వేయర్ ఒకరు చొప్పున ఉండాల్సి ఉండగా టీపీవో, టీపీబీవో మాత్రమే ఉన్నారు.

అదనపు పని భారం..

భూపాలపల్లి మున్సిపాలిటీకి మంజూరైన పోస్టులు ఖాళీగా ఉండటం, కొత్తవి మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బందికి పని భారం తప్పడం లేదు. పట్టణంలో నివాస భవనాలు 10,952, నివాస భవనాలు 834, వ్యాపార సముదాయాలు 567, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భవనాలు 1,211 ఉన్నాయి. వీటి నుంచి ప్రతిఏటా సుమారు రూ. 3 కోట్లకు పైగా ఆస్తి పన్ను రావాల్సి ఉంటుంది. అయితే పన్నుల వసూలుకు ఇద్దరు బిల్ కలెక్టర్లు మాత్రమే ఉన్నారు. వీరిద్దరే పట్టణంలోని 30 వార్డుల్లో పన్నులు వసూలు చేయలేరు. దీంతో అధికారులు చేసేది లేక ఔట్‌సోర్సింగ్ పద్ధతిన సిబ్బందిని నియమించుకుని పన్నులు వసూలు చేపిస్తున్నారు. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీవో, టీపీబీవో మాత్రమే ఉండటంతో అన్నింటిని పర్యవేక్షించడం వీలు కావడం లేదు. ఫలితంగా పట్టణంలో అనుమతి లేని కట్టడాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డ్రాఫ్ట్‌మెన్స్ లేకపోవడంతో అన్నీ ఏఈనే చూసుకోవాల్సి వస్తోంది. దీంతో వివిధ అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూపాలపల్లి మున్సిపాలిటీకి సరిపడా అధికారులు, సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం..

మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించాం. కొత్త పోస్టులను కూడా మంజూరు చేయాలని కోరాం. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేశాం.

- బిర్రు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్

దేవాదుల పనుల్లో నిర్లక్ష్యం వీడాలి



సమీక్షలో మాట్లాడుతున్న భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు

- కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి
- అధికారుల పనితీరులో మార్పు రావాలి
- భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్ పరిశీలన

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటామని, దేవాదుల పనుల్లో కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం వీడాలని, పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్‌ను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. తుపాలకుగూడేనికి హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రులకు మంత్రి సీతక్క ఆహ్వానం పలికారు. ఆ తర్వాత సమ్మక్క బ్యారేజీ వద్ద 59 గేట్లను పరిశీలించారు. నీటి నిల్వలు ఏ మేరకు ఉన్నాయని, గేట్లు ఎన్ని ఎత్తి, ఎన్ని మూశారని తెలుసుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయిలో దేవాదుల పంపుహౌస్ వద్ద ఉన్న గోదావరి నీటి నిల్వలను పరిశీలించి మోటార్ల ఎన్ని నడుస్తున్నాయని, ఎంత నీరు ఎత్తిపోశారని ఆరా తీశారు. ఇరిగేషన్ ఈఎన్‌సీ వెంకటేశ్వర్‌రావు ప్రొజెక్టర్ ద్వారా మంత్రులకు దేవాదుల స్థితిగతులను వివరించారు. అనంతరం సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టిందని, ఈ హైలీ ప్రాజెక్టును టీడీపీ, బీఆర్‌ఎస్ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. అప్పుడు చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే, ఇప్పుడు పూర్తి చేసేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ఇరిగేషన్‌కు రూ.23వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే రూ.16 వేల కోట్లు వడ్డీలు కట్టేందుకే సరిపోతుందన్నారు. కావేరి, గోదావరికి అనుసంధానంగా 200 టీఎంసీల కెపాటీగల ఇచ్చంపల్లి, తుమ్మడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి తీరుతామన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మంత్రులతో మాట్లాడి ఎన్‌ఓసీ కూడా తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ములుగు జిల్లాకు న్యాయం చేయాలి : మంత్రి సీతక్క

ములుగు జిల్లాలో వంద కిలోమీటర్ల గోదావరి నీటి ప్రవాహం ఉందని మంత్రి సీతక్క అన్నారు. సమైక్య రాష్ట్రంలో ములుగుకు అన్యాయం జరిగిందని, స్వరాష్ట్రంలో న్యాయం చేయాలని ఆమె కోరారు. రామచంద్రపురం గ్రావిటీ కెనాల్ ద్వారా పాకాల, కొత్తగూడెం నీటి సరఫరా చేయాలి. పొట్లాపురం కెనాల్ కోసం సంబంధిత ఫైల్‌ను ప్రభుత్వం వద్ద ఉందని, దానిని పరిశీలించి బడ్జెట్ ఇవ్వాలి. గౌరారం, మల్లూరు, రామప్ప, లక్నవరం ప్రాంతాల్లోకి రైతులకు నీరు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేసి పంటలకు నీళ్లివ్వాలని కోరారు. సమీక్షలో ఇరిగేషన్ కమిషనర్ ప్రశాంత్‌పాటిల్, ఇరిగేషన్ ఈఈ జగదీశ్, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, అప్సర్‌పాషా పాల్గొన్నారు.

6 లక్షల ఎకరాలకు సాగు నీరు : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క,

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ 17 నియోజకవర్గాల్లో 6 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని లక్ష్యంగాపెట్టుకొని దేవాదుల ప్రాజెక్టు నిర్మించామని తెలిపారు. ఇప్పుడు దీని అంచనాలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 16.38 టీఎంసీల నుంచి 17.38 టీఎంసీలకు పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రూ.16 కోట్లు దేవాదుల భూ నిర్వాసితులకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లిస్తామన్నారు. 72 మీటర్ల నీటిని నిల్వ చేసుకొని మోటార్ల ద్వారా ఎత్తిపోసి రిజర్వాయర్ల నుంచి కెనాల్ ద్వారా సాగు నీరు అందిస్తామని తెలిపారు.

రేపటితో రైతుబీమా గడువు ముగింపు

జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి బాబు



బాబు, జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి

భూపాలపల్లి రూరల్ : అన్నదాతల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం రెన్యూవల్ గడువు ఈ నెల 12వ తేదీతో ముగియనుంది. జిల్లాలోని రైతులంతా రైతుబీమాను రెన్యూవల్ చేసుకోవాలని, అదేవిధంగా కొత్త పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు సైతం సంబంధిత రైతు వేదికల్లో ఏఈఓల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయశాఖ అధికారి బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 59 ఏళ్ల వయసు గలవారు 2025, జూన్ వరకు భూభారతి ద్వారా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు అర్హులని పేర్కొన్నారు. రైతులు ఏదైనా ప్రమాదం, అనారోగ్యం లేదా ఇతర కారణాల వల్ల మరణించిన పక్షంలో నామినికి ఎల్‌ఐసీ ద్వారా రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేస్తారని వివరించారు. ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని, ప్రతి ఏటా ఆగస్టు 15నుంచి తదుపరి ఆగస్టు 14 వరకు బీమా చెల్లుబాటులో ఉంటుందని వెల్లడించారు. రెన్యువల్ లేదా కొత్తగా నమోదు కావాలనుకునే రైతులు సమీపంలోని ఏఈఓ లేదా రైతు వేదికలో గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని బాబు సూచించారు.

రామప్ప శిల్పకళ అద్భుతం



రామప్ప శిల్పాలను పరిశీలిస్తున్న టోమాసకా

వెంకటాపురం(ఎం): రామప్ప శిల్పకళ అద్భుతంగా ఉందని జపాన్ దేశానికి చెందిన టోమాసకా కొనియాడారు. మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని ఆమె ఆదివారం సందర్శించి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయగా ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. అదేవిధంగా పర్యాటకులు సైతం అధిక సంఖ్యలో రామప్పకు తరలివచ్చి రామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు.

దేశభక్తి కలిగి ఉండాలి

ములుగు రూరల్ : ప్రతీ పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌కుమార్ శ్రీవాత్సవ, సెకండ్ ఇన్ కమాండెంట్ జెగ్‌షేర్, డిప్యూటీ కమాండెంట్ ఎస్‌పి రజిత పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బెటాలియన్ ఆధ్వర్యంలో ఆదివారం సీఆర్‌పీఫ్ అధికారులు డీఎల్ఆర్ నుంచి గాంధీ విగ్రహం వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు దేశభక్తి కలిగి ఉండాలని వివరించారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న మోదీ

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్ : ప్రజాస్వామ్య విలువలను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, బీజేపీకి ఏజెంట్‌గా కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దొడ్డిదారిన దొంగ ఓట్లతో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాడని విమర్శించారు. దేశ ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకున్నారని, కానీ దొంగ ఓట్ల విధానంతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలపై మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించిన వారిపై బీజేపీ కనుసన్నల్లో ఈడీ, ఐటీ సంస్థలు దాడులతో బెదిరిస్తోందని పేర్కొన్నారు. అనంతరం జయశంకర్ ఉద్యానవనాన్ని సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్‌లో కలియ తిరిగారు. జిమ్ పరికరాల రిపేర్, సైడ్ డ్రెయినేజీ పైకప్పు పూర్తిగా నిర్మించాలని ఆదేశించారు. లైటింగ్, ఫౌంటెన్‌ను వెంటనే అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలి అధికారులకు ఆయన సూచించారు.

దొంగతనాలపై ఎమ్మెల్యే ఆరా..

భూపాలపల్లిలోని లక్ష్మీనగర్ కాలనీల్లో శనివారం రాత్రి దొంగతనాలు జరిగిన వారి ఇళ్లకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు వెళ్లి బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 9మంది ఇళ్లలో దొంగతనాలు జరగడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజల భద్రతకు పోలీసులు మరింత కట్టుదిట్టమైన పహారా, సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రివేళ పెట్రోలింగ్ వంటి చర్యలు వెంటనే చేపట్టాలని ఆయన కోరారు. ఇలాంటి ఘటనలు మళ్లీ కాకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, నాయకులు బుర్ర కొమురయ్య, అంబాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్ గౌడ్, తోట రంజిత్, మహేందర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పూజారుల గదులను పట్టించుకోరూ?



మరమ్మతు చేయని పూజారుల గదులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలో నిర్మించిన పూజారుల గదులు మరమ్మతులకు చేరుకున్నాయి.గతంలో మహాజాతర సందర్భంగా సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారుల కోసం దేవాదాయ శాఖ ఆవరణంలో ప్రత్యేక గదులు నిర్మించారు. జాతర సమయాల్లో పూజారులు గదుల్లో ఉండి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. గదులు మరమ్మతుకు రావడంతో పూజారులకు మళ్లీ పాత తొమ్మిది గదుల రేకుల షెడ్డు దిక్కైంది. కొన్ని గదుల కిటికీలు, తలుపులు పగిలిపోయాయి.అలాగే టైల్స్ సైతం దెబ్బతిన్నాయి. దేవాదాయశాఖ అధికారులు పూజారుల గదులను పట్టించుకోకపోవడంతో మరమ్మతుకు చేరుకున్నాయి. అమ్మవార్లను కొలిచే పూజారుల గదులే ఇలా ఉంటే భక్తుల సౌకర్యాలు ఎలా ఉన్నాయో సంబంధిత అధికారులకే తెలియాల్సి ఉంది. ఇటీవల పూజారుల కోసం నూతన భవనం నిర్మించారు. కానీ మహాజాతర సమయంలో పూజారులకు గదులు చాలా అవసరం. జాతర సమయంలో భక్తుల రద్దీకి పూజారులు బయటకు వెళ్లే పరిస్థితి ఉండదు. గద్దెల దగ్గర గదులు ఉండడంతో పూజా కార్యక్రమాలకు, అధికారులకు వారు అందుబాటులో ఉంటారు. దేవాదాయశాఖ అధికారులు స్పందించి గదులకు మరమ్మతులు చేపట్టాలని పూజారులు కోరుతున్నారు.

దొంగల బీభత్సం

ఒకే రోజు రాత్రి 10 ఇళ్లలో చోరీ
- రాఖీ పండుగకు వెళ్లి వచ్చే సరికి ఇళ్లు గుల్లా
- నాలుగు నెలలుగా తరచూ దొంగతనాలు
- విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు అపహరణ
- నిద్రావస్థలో పోలీసులు



దొంగలను పసిగట్టేందుకు ప్రయత్నిస్తున్న డాగ్ స్క్వాడ్



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్



చోరీకి గురైన ఇళ్ల వద్ద కాలనీ వాసులు

భూపాలపల్లి అర్బన్: రాఖీ పండుగ జిల్లా కేంద్రంలోని పలువురు ఇళ్లలో విషాదంగా మారింది. రాఖీలు కట్టేందుకు సొంత ఊళ్లు, సోదరుల వద్దకు వెళ్లి వచ్చే సరికి దొంగలు ఇళ్లను దోచుకెళ్లారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఒక లైన్‌లో ఉన్న 3 ఇళ్లతో పాటు మరో లైన్‌లోని 4 పక్కపక్కనే ఉన్న ఇళ్లలో శనివారం రాత్రి దొంగతనాలకు పాల్పడ్డారు. మరో మూడు ఇళ్లలో చోరీకి ప్రయత్నించారు. ఈ నెల 9వ తేదీన రాఖీ పండుగ నేపథ్యంలో కొంత మంది 8న, మరి కొందరు 9వ తేదీన వారివారి బంధువుల ఇళ్లకు వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి కొందరు చూసే వరకు, మరికొందరివి ఇంటి పక్కన వారు చూసి దొంగతనం జరిగిందని సమాచారం అందించారు. ఇంటి తాళాలు పగులకొట్టి ఉండగా ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలు ధ్వంసం చేసి ఉన్నాయి.

26 తులాల బంగారం.. రూ.2.38లక్షల నగదు

లక్ష్మీనగర్‌లో 10 ఇళ్లలో జరిగిన చోరీలో మూడు ఇళ్లలో ఎటువంటి బంగారు ఆభరణాలు, నగదు లేవు. మిగితా ఏడు ఇళ్లలో 26 తులాల బంగారం, 53 తులాల వెండి, రూ.2.38 లక్షల నగదు అపహరణకు గురైంది. బాధితులు కథనం ప్రకారం.. బడితల సంతోష్ ఇంట్లో 12 తులాల బంగారం, 23 తులాల వెండి, రూ.58వేల నగదు, చదువు రాకేశ్‌రెడ్డి ఇంట్లో రూ.70వేలు, ఓదెల సుమతి ఇంట్లో 8 గ్రాముల బంగారం, రూ. 25వేల నగదు, నగునూరి రాజశేఖర్ ఇంట్లో తులం బంగారం, రూ.37వేలు, ఆకుల రాజ్‌కుమార్ ఇంట్లో తులం బంగారం, రూ.30 వేలు, ప్రవీణ్ ఇంట్లో తులం బంగారం, రూ.45 వేలు, 30 తులాల వెండి, మాచనపల్లి సురేశ్ ఇంట్లో 10 తులాల బంగారం అపహరణకు గురైంది. అదే కాలనీకి చెందిన జక్కుల రాములు ఇంటితో పాటు మరో ఇద్దరి ఇళ్లలో చోరీకి ప్రయత్నించగా ఎటువంటి బంగారు వస్తువులు, నగదు లభించలేదు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా..

జిల్లా కేంద్రంలో నేర నియంత్రణ, దొంగతనాలను అదుపు చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. అయినప్పటికీ దొంగతనాలు ఆగడం లేదు. జూన్‌లో ఆరుగురు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. అయినప్పటికీ గతంలో మాదిరిగానే దొంగతనాలు జరుగుతున్నా పోలీస్ శాఖ ఏం చేస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

సంఘటన స్థలం పరిశీలన

దొంగతనాలు జరిగిన ఇళ్లను స్థానిక సీఐ నరేష్‌కుమార్‌తో పాటు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించారు. క్లూస్ టీమ్ సిబ్బంది వేలి ముద్రలు సేకరించారు. విచారణ వేగవంతం చేసి దొంగలను పట్టుకుంటామని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. కాలనీ చుట్టు పక్కల ఉన్నటువంటి సీసీ కెమెరాలలో వీడియోలను పరిశీలిస్తున్నారు.

పోలీసుల నిఘా కరువు

జిల్లా కేంద్రంలో నాలుగైదు నెలలుగా వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఒక సీఐ, నలుగురు ఎస్సైలతో పాటు ఏఎస్సై, కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా దొంగతనాలు జరుగుతున్నాయి. జరిగిన ప్రతీసారి 5 ఇళ్లకు మించి దోపిడీకి గురవుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు ఏమాత్రం ప్రత్యేక నిఘా పెట్టన్నట్లు కనిపిస్తోంది. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్, బ్లూకోర్ట్ టీమ్ కాలనీల్లో గస్తీ చేపట్టకుండా ఏం చేస్తుందని పలువురు బాధితులు మండి పడుతున్నారు. గత మూడు నెలల క్రితం పోలీస్‌స్టేషన్ పక్కనే సుమారు ఐదు సింగరేణి క్వార్టర్లు, ఎండీ క్వార్టర్లలో దొంగతనాలతో పాటు వివిధ కాలనీల్లో దొంగతనాలు జరుగుతున్నా ఎందుకు నియత్రించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

- టీపీఆర్‌టీయూ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మన్నె చంద్రయ్య



చంద్రయ్య

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి పోరాడుతామని టీపీఆర్‌టీయూ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మన్నె చంద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలని, 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలని, రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లో 10 వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని కోరారు. ఇటీవల తాత్కాలికంగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మళ్లీ త్వరితగతిన చేపట్టాలని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత



భక్తురాలికి బంగారం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు విజయ్‌కుమార్

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో ఓ భక్తురాలు పోగొట్టుకున్న బంగారాన్ని సిబ్బంది ఆమెకు అప్పగించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకోవడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ భక్తురాలి అర్థతులం చెవికమ్మ ఆలయ ప్రాంగణంలో పడిపోయింది. దీనిని గమనించిన ఓ వ్యక్తి ఆ ఆభరణాన్ని ఆలయ పర్యవేక్షకుడు అద్దంకి విజయ్‌కుమార్‌కు అందజేయగా ఆయన భక్తురాలికి అప్పగించారు. దీంతో భక్తురాలు.. ఆలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం
- గణపురం సమీపంలో ఘటన



జగదీశ్ మృతదేహం

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రం సమీపంలోని కోట కాల్వ వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. గణపురం ఎస్సై రేఖాఅశోక్ కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన దాసరి జగదీశ్(24) ఏసీ టెక్నీషియన్‌గా, తన స్నేహితుడు మర్వికుసుముదార్ జగదీశ్ సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడు ఆదివారం సెలవు సందర్భంగా ఇద్దరు బైక్‌పై రామప్పకు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తున్నారు. ఈ క్రమంలో గణపురం మండలకేంద్రం శివారు కోట కాల్వ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈఘటనలో దాసరి జగదీశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో యువకుడు మర్వికుసుముదార్ జగదీశ్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహంతోపాటు క్షతగాత్రుడిని 108లో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్లం, పటిక పట్టివేత

కాజీపేట రూరల్: 80 కిలోల బెల్లం, 20 కిలోల పటికను కాజీపేట జంక్షన్‌లో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట జీఆర్పీ ఎస్సై ఎం.అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా అనిల్ ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి బల్హార్షకు వెళ్లి తక్కువ ధరకు బెల్లం, పటిక కొని తిరిగి కాజీపేటకు చేరుకుని వేరే రైలులో మహబూబాబాద్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ క్రమంలో సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగి అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అభినవ్ చేసినట్లు వివరించారు.



రామప్ప కీర్తిని చాటేలా..

కాకతీయుల కళావైభవానికి ప్రతీక రామప్ప దేవాలయం. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు రావడంతో రామప్ప కీర్తి మరోసారి మార్మోగింది. 1213 లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో దేశ,విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. పర్యాటక ప్రాంతానికి మారుపేరు ములుగు జిల్లా. రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర, తాడ్వాయి హట్స్, ఏటూరునాగారం అభయారణ్యం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం, బొగత జలపాతంతో పాటు మరికొన్ని జలపాతాలు ములుగు జిల్లాకు ప్రత్యేకం. పర్యాటక జిల్లాగా పేరొందిన ములుగు జిల్లాలోని కూడళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పలుచోట్ల థీంలు ఏర్పాటు చేస్తుండడంతో కూడళ్లు జిగేల్ మంటున్నాయి.

-వెంకటాపురం(ఎం)



విద్యుత్ కాంతుల్లో డమరుకం



విద్యుత్ కాంతుల్లో నంది విగ్రహం

మరికొన్నిచోట్ల..

జిల్లాలో జంగాలపల్లి కూడలితోపాటు బండారుపల్లి రోడ్డు కూడలి వద్ద 'ఐ లవ్ ములుగు' అనే థీం ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క–సారలమ్మ తాడ్వాయి మండలం నార్లాపూర్–బయ్యక్కపేట కూడలి వద్ద సమ్మక్క–సారలమ్మ ప్రాచుర్యాన్ని తెలిపేలా కుంకుమ భరిణె థీంను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. మేడారం జాతరలోగా కుంకుమ భరిణె థీంను నెలకొల్పి ఆసియాలోనే అతిపెద్ద జాతరకు వచ్చే భక్తులకు కనువిందు చేయనున్నారు. అదేవిధంగా తాడ్వాయి మండల కేంద్రంలోని మేడారం ఆర్చీ వద్ద ఆదివాసీ జీవన విధానం, వారి సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా 'ఆదివాసీ బాణం సంధించే థీం' ను అధికారులు ఏర్పాటు చేయనున్నారు.

కాకతీయ కళావైభవంతో మెరిసిపోతున్న జంగాలపల్లి కూడలి

- రూ.2.61 కోట్లతో పూర్తయిన సుందరీకరణ పనులు
- విద్యుత్ వెలుగుల్లో నంది విగ్రహం, డమరుకం, శిలాశాసన మండపం

జిల్లాలో రూ.2.61 కోట్లతో పలు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నారు. ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ వద్ద సుందరీకరణ పనులు చేపట్టి ఆదివారంతో పూర్తి చేశారు. జంగాలపల్లి క్రాస్‌లోని జంక్షన్‌లో రామప్ప

రామప్ప ఆలయ విశిష్టత తెలియజేసేలా..

ఆలయ విశిష్టత తెలియజేసేలా శివుడి వాహనమైన నందీశ్వరుడిని (నంది విగ్రహాన్ని) ఏర్పాటు చేసి మూడు పక్కల మూడు ఏనుగు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా శివుడు డమరుకం వాయిస్తున్నట్లు చూపుతూ డమరుకం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రామప్ప ఆలయాన్ని చూపే విధంగా శిలాశాసన మండపం మాదిరి మండపాన్ని నిర్మించారు. మండపం చుట్టూ ఆరుగురి మదనికల శిల్పాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేసి లోపల గ్రాస్‌తో గ్రీనరీ ఏర్పాటు చేసి వివిధ రకాల పూలమొక్కలు నాటారు. గ్రిల్స్‌కు డమరుకం, త్రిశూలం, శివుని మూడో కన్నుతో కూడిన త్రినయనం చిహ్నాలు నిర్మించారు. రాత్రివేళ విద్యుత్ కాంతుల మధ్య నంది విగ్రహం, డమరుకం, మండపం, మదనికల భంగిమలతో కూడిన శిల్పాలు జిగేల్ మంటున్నాయి. నంది విగ్రహంతోపాటు మండపం నుంచి ఫౌంటేన్‌లా నీరు ఎగిసిపడుతుండడంతో ప్రజలు సెల్ఫీలు దిగుతూ సంబురపడిపోతున్నారు. విద్యుత్ వెలుతురులో కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా జంగాలపల్లి కూడలి మెరిసిపోతోంది.



మండపం నుంచి ఫౌంటేన్‌లా జాలువారుతున్న నీరు

కబ్జా చేశాడు.. అద్దెకిచ్చేశాడు!



ఎస్సారెస్పీ భూముల్లో లారీల పార్కింగ్

- రూ.10 కోట్ల భూమి స్వాహా
- దర్జాగా ఇసుక లారీల పార్కింగ్
- అక్రమార్కుడిపై ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

హసన్‌పర్తి: ఓ అక్రమార్కుడు దర్జాగా ఎస్సారెస్పీ భూములు ఆక్రమించాడు. అంతటితో ఆగలేదు. ఆ భూమిని అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల సహకారంతోనే ఈ వ్యవహారం సాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.10కోట్ల మేరకు భూమి స్వాహా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని చింతగట్టు క్యాంపులోని నీటి పారుదలశాఖ ప్రధాన కార్యాలయం సమీపంలో సుమారు రెండెకరాల ఎస్సారెస్పీ భూమి ఉంది. అయితే ఈ స్థలాన్ని మూడేళ్లుగా ఓ అక్రమార్కుడు కబ్జా చేశాడు.

దర్జాగా ఇసుక లారీల పార్కింగ్..

ఈ భూమిలో దర్జాగా ఇసుక లారీల పార్కింగ్ నిర్వహిస్తున్నారు. నెలకు ఒక్కొక్క లారీ యజమాని నుంచి కొంతమొత్తంలో అద్దె డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్థానికంగా చెబుతున్నారు. ఈ మాముళ్లల్లో అధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడేళ్లుగా ఇక్కడ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అలాగే, ఈ భూమిలో ఓ డబ్బా కూడా ఏర్పాటు చేశాడు. ఆ డబ్బాలను కూడా అద్దెకిచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఇసుక లారీల పార్కింగ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఫలితంగా ఇటు వైపు రాకపోకలు సాగించాలంటే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. లారీ డ్రైవర్లు మద్యం సేవిస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని, దీంతో రాత్రి వేళ ఈ మార్గం నుంచి వెళ్లాలంటే భయమేస్తోందని స్థానికులు తెలిపారు. కాగా, కాలనీవాసుల ఇటీవల సమావేశం ఏర్పాటుచేసి లారీల పార్కింగ్ తొలగించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించినట్లు తెలిసింది.

> **చర్యలు తీసుకుంటాం**
>
> కబ్జాదారుడిపై చర్యలు తీసుకుంటాం. ఇక్కడ నుంచి లారీల అడ్డాను తొలగిస్తాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం
>
> -రాజు, డీఈఈ, నీటిపారుదలశాఖ

సురేశ్‌కు జాతీయ పురస్కారం

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన నల్లగొండ సురేశ్ గిడుగు రామ్మూర్తి స్మారక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవ సంస్థ సీఈఓ ఉలవలపుడి వెంకటరత్నం, జాతీయ కమిటీ ప్రోగ్రాం డైరెక్టర్ ధనశి ఉషారాణి, భవాని సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా సురేశ్ పురస్కారం అందుకున్నారు. కాగా, సురేశ్ నవయుగ శతకం, దశధీరులు, కావ్య ఖండికతో పాటు అనేక పద్యాలు, రచనలు రాశారు. సురేశ్ ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఇడిపిలవంచ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా కొప్పూరు గ్రామస్తులు, సహ ఉపాధ్యాయులు.. సురేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న సురేశ్

గుర్తుతెలియని వాహనం ఢీ..

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో ఘటన



ఘటనాస్థలిలో క్షతగాత్రులు, బైక్

ఐనవోలు: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని కక్కిరాలపల్లి క్రాస్ సమీపం వరంగల్–ఖమ్మం రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన చాట్ల నవీన్, వరుసకు బావ మరుదులైన ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామానికి చెందిన జక్కుల సన్నీ, జక్కుల బన్నీ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి వేడుకకు హాజరయ్యారు. అనంతరం నవీన్ ద్విచక్ర వాహనంపై బావమరదులు సన్నీ, బన్నీలతో కలిసి పున్నేలుకు బయలుదేరాడు. ఈ క్రమంలో కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో వరంగల్–ఖమ్మం రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ప్ర యాణికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. అయితే ప్రమాదం జరిగి గంటదాటినా ఘటనా స్థలికి 108 వాహనం రాకపోవడంపై పలువురు మండిపడ్డారు. తీవ్ర గాయాలైన ఒకరిని ముందు ఆటోలో తరలించగా మరో ఇద్దరిని 108లో ఆస్పత్రికి తరలించారు.

బొగతలో పర్యాటకుల సందడి..



వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదిన కావడంతో భారీ సంఖ్యలో తరలొచ్చారు. ఈ సందర్భంగా జలపాతం జలధారలను వీక్షించడంతోపాటు సెల్ ఫోన్లలో బంధించారు. కొలనులో స్నానాలు చేస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. నడిచి వెళ్లలేని పర్యాటకుల కోసం రైడర్ వాహనం ఏర్పాటు చేసి జలపాతం వద్దకు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE

- Ready to Occupy 1 BHK, 2BHK & 3 BHK Flats with all Facilities for Sale @ 941 Sqft to 1914 sqft with reasonable Prices at Vikas Nagar & Basith Nagar. Ph: 8897221187, 9177592357. [WA-6757]

WANTED

- డ్రైవర్స్ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయుటకు DCM & బోలారో డ్రైవర్స్ కావలెను. ఫోన్ కాల్ టైమ్ 11am-6pm. Cell: 9396991649. [SCA25007145]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పంటకు ప్రయోజనకారి..

- సుడోమోనాస్, ట్రైకో డెర్మావిరిడి పొడి మందులతో తెగుళ్లు అంతం..
- విత్తనశుద్ధి, భూసారం, పంట పెరుగుదల కూడా ఈ మందులతో పెంపు



విత్తన, మొక్క శుద్ధి, మిశ్రమ తయారీ విధానం

డోర్నకల్: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం విరివిగా పెరుగుతోంది. దీంతో భూమిలో సారం తగ్గడంతోపాటు దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు అప్పులపాలవుతున్నారు. అంతేకాకుండా రసాయన పురుగు మందుల వినియోగంతో మిత్ర పురుగులు అంతరించడంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఫలితంగా నేల కాలుష్యంతో నేలసారం తగ్గడం, వ్యవసాయ ఉత్పత్తుల్లో పురుగు మందుల అవశేషాలు ఉండి నాణ్యతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి అనేక దుష్పరిమాణాలను దృష్టిలో ఉంచుకుని వీటిని అధికమించడానికి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రూపొందించారు. ఇందులో భాగంగా రసాయన మందులకు ప్రత్యామ్నాయంగా జీవశిలీంధ్ర నాశినిలుగా గుర్తింపు పొందిన సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి పొడి మందులను వినియోగంలోకి తీసుకొచ్చి కాలుష్యాన్ని అరికడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి వినియోగంతో విత్తనశుద్ధి, పంట ఎదుగుదల, తెగుళ్ల నివారణ లాంటి ప్రయోజనాలు ఉన్నాయి. సుడోమోనాస్ బ్యాక్టీరియా మొక్కల్లో ఆక్సిజన్, జిబ్బరిలిన్లను ఉత్పత్తి చేసి పంట ఎదుగుదలకు సహాయపడడమే కాకుండా వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి. పంట తొలిదశలో వీటిని వినియోగిస్తే ఎక్కువ సమర్థవంతంగా పని చేస్తాయి. సుడోమోనాస్ కేజీ రూ.150, ట్రైకోడెర్మావిరిడి కేజీ రూ.100 చొప్పున వ్యవసాయ కార్యాలయాలు, ఫర్టిలైజర్ దుకాణాల్లో లభ్యమవుతాయి.

సుడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడి పొడి మందులు వినియోగించే పద్ధతులు..

విత్తన శుద్ధి..

కిలో విత్తనానికి 8–10 గ్రాముల పొడిమందు సరిపోతుంది. లేదా పొడి మందు 10 మి.లీ నీటితో కలిపి విత్తనశుద్ధి చేయొచ్చు. అరటి, పసుపు దుంపలు, చెరుకు ముచ్చెలను శిలీంధ్ర ద్రావణంలో కలిపి ముంచి నాటాలి. 500 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడి 100 లీటర్ల నీటిలో కలిపి ఉపయోగించుకోవాలి.

వేర్లను శుద్ధి చేయడం..

వరి, వంకాయ, టమాట, మిరప పైర్లను కిలో సుడోమోనాస్ ఫార్ములేషన్ నిల్వ ఉండే నీళ్లలో కలిపి వాటి వేర్లను గంట సమయం పాటు ఈ నీటిలో ఉంచిన తర్వాత నాటకుంటే తెగుళ్లను నివారించడమే కాకుండా పెరుగుదలను పెంచుతుంది.

భూమిలో చల్లే విధానం..

ఎకరాకు 2 నుంచి 3 కిలోలు దుక్కిలో వేయాలి. కిలో సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్, 10 కిలో గ్రాముల వేప పిండి, 90 కిలోగ్రాముల బాగా చితికిన పశువుల ఎరువుతో మిశ్రమాన్ని తయాలు చేసి వారం రోజులు నీడలో ఉంచి దుక్కిలో వేసుకోవాలి. వేప పిండి, పశువుల ఎరువు అందుబాటులో లేకుంటే ఇసుకతో కలిపి వాడొచ్చు.

పిచికారీ..

కిలో పొడి మందును 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పైరుపై పిచికారీ చేయాలి.



మిశ్రమాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

వినియోగంలో ఈ జాగ్రత్తలు పాటించాలి...

- వినియోగించే ముందు భూమిలో తేమ ఉండేలా చూసుకోవాలి.
- వీటిని కంపోస్ట్, ఇతర పశువుల ఎరువులు, జీవ సంబంధ పదార్థాలతో కలిపి వాడొచ్చు.
- రసాయన పురుగుమందులతో కలిపి వాడకుంటే పంటలకు మేలు.
- చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి.
- మిశ్రమాన్ని తయారు చేసిన ఆరు నెలల లోపు వాడాలి.

పంట పేరు	సుడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడి పొడి మందులతో అరికట్టే తెగుళ్లు
వరి	అగ్గితెగులు, మెదవిరుపు, పాముపొడ తెగులు (బ్యాక్టీరియా), ఎండు తెగులు
పత్తి	నారుకుళ్లు, వేరుకుళ్లను నివారిస్తాయి
మిరప	ఆకుపచ్చ, ఎండుతెగుళ్లు
వేరుశనగ	ఎండుతెగుళ్లు
మినుము, శనగ	వేరుకుళ్లు
పొద్దుతిరుగుడు	నల్లమచ్చల తెగుళ్లు(ఆన్ త్రక్నస్)
మామిడి	మొక్క ఎదుగుదల, దిగుబడి పెరగడం
పామాయిల్	(సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి కలిపి వాడాలి)

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

- తాళ్లపూసపల్లిలో ఘటన



మురళి మృతదేహం

కేసముద్రం: కుటుంబ కలహాలతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తాళ్లపూసపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వలసాని మురళి(39) కొంత కాలంగా మద్యానికి బానిసై భార్య రేణుకతో తరచూ గొడవ పడుతూ చనిపోతానని బెదిరించేవాడు. ఈ క్రమంలో శనివారం మురళి భార్య రాఖీ పండుగ సందర్భంగా తన తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న మురళి మద్యం తాగి మత్తులో చెరువుకట్టపై గడ్డిమందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మురళి అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి అన్న యాకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రేపాకలో వ్యక్తి..

రేగొండ: ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని రేపాకలో చోటు చేసుకుంది. ఎస్సై షాఖాన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సామర్ల బాబు (47) ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య అహల్య, ఇద్దరు కుమారులు రాజు, అజయ్ ఉన్నారు.

దేవాదుల, సమ్మక్క బ్యారేజీని పరిశీలించిన మంత్రులు



దేవాదుల నీటిని చూపిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



సమ్మక్క బ్యారేజీని పరిశీలిస్తున్న మంత్రులు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం సందర్శించారు. ప్రాజెక్టులోని పలు దశల పనులను అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో మంత్రులు మాట్లాడారు.

జీజీహెచ్ భవనం పైనుంచి పడి రోగి మృతి



ఐలయ్య (ఫైల్)

నెహ్రూసెంటర్: ఓ రోగి ప్రమాదవశాత్తు మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మూడో అంతస్తు నుంచి పడి మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన నాయిని ఐలయ్య (55) జ్వరంతో బాధపడుతూ ఈ నెల 7వ తేదీన జీజీహెచ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతున్న వార్డు బాల్కనీ నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఘటనపై వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య యాదమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.